

బీరు ప్రియులపై

భారం

- రూ.20-రూ.40 వరకు ధర పెంపు
- పెరిగిన ధరల ప్రకారం నేటి నుంచి సరఫరా 6

వణికిస్తున్న బర్డ్ ఫ్లూ

- ఏపీలో కోళ్లకు సోకుతున్న వైరస్
- సరిహద్దుల్లో ఉండటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆందోళన
- ఏపీ నుంచి కోళ్ల వ్యాన్లు రాకుండా అధికారుల చర్యలు
- పడిపోతున్న చికెన్ విక్రయాలు

ఖమ్మం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా సరిహద్దున ఉన్న ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కలవరం మొదలైంది. జిల్లాలో గత నెలరోజులుగా లక్షకుపైగా కోళ్లు వైరస్ కారణంగా మృత్యువాతపడిన విషయం విదితమే. ప్రస్తుతం ఏపీలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందుతుండడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రత్తమైంది. పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి మండలాల్లో గత నెల రోజులుగా వైరస్ కారణంగా కోళ్లు చనిపోవడంతో చాలావరకు కోళ్లఫారాలు ఖాళీ అయ్యాయి.



దీనిపై పశు సంవర్ధకశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించి సాధారణ వైరస్ అని ముందుగా తేల్చారు. దీంతో కోళ్లఫారాల యజమానులు అప్రమత్తమై ముందు జాగ్రత్తగా కోళ్లఫారాలు ఖాళీచేశారు. ప్రస్తుతం కొత్తగా కోళ్లు తేవడం లేదు.

ఇదిలావుండగా ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకి మరణిస్తున్నట్టు నిర్ధారణ కావడంతో ఏపీ నుంచి కోళ్ల వ్యాన్లు రానివ్వకుండా పశు సంవర్ధక శాఖ అధికారులు పెనుబల్లి మండలం ముత్తగూడెం, అశ్వారావుపేట, దమ్మపేట మండలం అల్లిగూడెంలో చెక్‌పోస్టులు వద్ద తనిఖీలు సాగిస్తున్నారు. పొరుగురాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ సోకుతున్నందున చికెన్ ప్రియులు చికెన్ తినేందుకు భయపడుతున్నారు. ప్రస్తుతానికి బర్డ్‌ఫ్లూ పొరుగున ఉన్న ఏపీలో ఉందని, ఖమ్మం జిల్లాలో అలాంటి లక్షణాలతో కోళ్లు చనిపోవడంలేదని పశు



అశ్వారావుపేట చెక్‌పోస్టు వద్ద పోలీసుల బందోబస్తు

సంవర్ధక శాఖ డీడీ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఏపీ నుంచి కోళ్లు రాకుండా సరిహద్దుల్లో చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఖమ్మం జిల్లాలో కోళ్లు చనిపోవడం మామూలు వైరస్‌తోనేనని బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని వివరించారు. జిల్లాలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఏపీ నుంచి కోళ్ల వ్యాన్లు జిల్లాకు రాకుండా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయినప్పటికీ చికెన్ ప్రియులు ఇప్పుడు చికెన్ తినాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ వ్యాపారం కూడా తగ్గుతున్నట్టు వ్యాపారులు వాపోతున్నారు.



ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై నుంచి నడిచి వస్తున్న మంత్రి తుమ్మల

ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై రాకపోకలు షురూ

- గత మున్నేరు వరదలతో కదిలిన స్పాన్లు
- నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సరిచేసిన అధికారులు
- ప్రజల ఇబ్బందులు తొలిగాయి: మంత్రి తుమ్మల

ఖమ్మం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగరంలో మున్నేరు భారీవరదలతో దెబ్బతిన్న ప్రకాష్‌నగర్ బ్రిడ్జికి మరమ్మతులు పూర్తికావడంతో మంగళవారం నుంచి రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ఖమ్మం పట్టణంతోపాటు ఖమ్మంరూరల్ మండలం అనుసంధానం చేస్తూ ఉన్న మున్నేరు ప్రకాష్ నగర్ బ్రిడ్జికి వరదల కారణంగా స్పాన్లు ఒరిగిపోవడంతో బ్రిడ్జి పిల్లర్ల మధ్య గ్యాప్ ఏర్పడింది. దీంతో ఆర్అండ్‌బీ శాఖ సాంకేతిక బృందం పరిశీలించి ప్రమాదకర పరిస్థితి గుర్తించింది. స్పాన్లు వంగిపోవడంతో బ్రిడ్జి గోడల మధ్య గ్యాప్ ఏర్పడినందున పూర్తి మరమ్మతులు అయిన (మిగతా 6వ పేజీలో)



పొలం గట్లపై నడిచి.. రైతుల వెతలు ఆలకించి..

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో పర్యటించారు. రైతులు సాగుచేసిన పంటపొలాలను కాలినడకన పరిశీలించారు. పంటల సంరక్షణకు తీసుకుంటున్న సస్యరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. చెట్టు కింద కూర్చొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సునీతా ఎలిజబెత్‌ను ఆదేశించారు. -ఆంధ్రజ్యోతి, ముదిగొండ

కొత్త రేషన్‌కార్డుల జారీ అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల ప్రక్రియను చేపట్టడంతో ప్రజలు వేలల్లో దరఖాస్తులు సమర్పించారు. అయితే ఆయా దరఖాస్తుల స్వీకరణ, విచారణ వంటి అంశాలపై స్పష్టత లేకపోవడంతో గందరగోళం ఏర్పడింది. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తులపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో అర్జీదారులు ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి సమయంలోనే తాజాగా మీ-సేవా కేంద్రాల్లో నూతన రేషన్‌కార్డులతో పాటు పాతకార్డుల్లో సవరణకు అవకాశం ఇవ్వడంతో మళ్లీ దరఖాస్తు చేయాలా? వద్దా ? అన్న అంశంపై అయోమయం నెలకొంది. గతంలో దరఖాస్తు చేసినవారు సైతం మళ్లీ మీ-సేవా కేంద్రాల వద్దకు పరుగులు పెడుతున్నారు.



ప'రేషన్' కార్డులు

కొత్త కార్డుల జారీపై అయోమయం

- 'మీ సేవ' కేంద్రాల్లో దరఖాస్తు చేయాలా.. వద్దా..
- ఒక వైపు అర్జీల డేటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది
- మరోవైపు మీ సేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్న ప్రజలు
- గ్రామసభల్లో ఉమ్మడి జిల్లాలో లక్షకు పైగా దరఖాస్తులు

ఖమ్మం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ సమయంలో ప్రత్యేకంగా రేషన్‌కార్డుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరించింది. అయితే ప్రజాపాలనకు సంబంధించిన వందలకొద్దీ దరఖాస్తులు గల్లంతవ్వగా వాటిలో రేషన్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తులు సైతం కనిపించకుండా పోయాయన్న ఆరోపణలు వినిపించాయి. ఆ తర్వాత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబసర్వేలో సైతం రేషన్ కార్డులకు సంబంధించిన వివరాలను సేకరించారు.

అయితే ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ప్రజాపాలన ఆధారంగా విచారణ నిర్వహించి రేషన్‌కార్డులకు సంబంధించి పలువురు పేర్లను ప్రకటించారు. సంబంధిత లబ్ధిదారుల జాబితాల్లో చాలా తక్కువమంది పేర్లు మాత్రమే ఉండటం, దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారి పేర్లు లేకపోవడంతో చాలా చోట్ల గ్రామసభలు రసాభాసగ మారాయి. ఆ సమయంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులు అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, జాబితాల్లో పేర్లు రానివారు మళ్లీ సంబంధిత పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నూతన రేషన్‌కార్డుల కోసం 7,401, సవరణ కోసం 4,593 దరఖాస్తులు వచ్చాయి. అవి మినహా జిల్లా వ్యాప్తంగా 50,914 నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 45,332రేషన్‌కార్డుల దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం ఆయా దరఖాస్తులను మండలాల స్థాయినుంచి ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి డేటా ఎంట్రీ చేయిస్తున్నారు.

దరఖాస్తుల డేటా ఎంట్రీ

గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే జిల్లాలో ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా దరఖాస్తులను మండలాలస్థాయి నుంచి ఖమ్మం కార్పొరేషన్ వరకు నమోదు సిబ్బందిని నియమించి (మిగతా 6వ పేజీలో)

డేటా ఎంట్రీ జరుగుతోంది...

చందన్‌కుమార్, డీఎస్వో, ఖమ్మం

గ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఆయా వివరాల నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విచారణ నిర్వహించి అర్హులను గుర్తిసారు. మీ-సేవాలకు సంబంధించిన దరఖాస్తులపై ఇప్పటివరకు మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

జేఈఈ మెయిన్స్‌లో 'ప్రైవేటు' సత్తా

బి.సాయిచరణ్‌కు 99.98 పర్సంటైల్



ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో ఖమ్మం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. పలు ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్స్ సాధించారు. నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థి (మిగతా 6వ పేజీలో)

1607 పరిషత్ పోలింగ్ కేంద్రాలు

- ముసాయిదా జాబితా విడుదల చేసిన సీఈవో

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, మండలపరిషత్ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తూ జడ్పీ సీఈవో దీక్షరైనా మంగళవారం రాత్రి ముసాయిదా జాబితా విడుదల చేశారు. జిల్లాలో 20 జడ్పీ ప్రాదేశిక నియోజకవర్గాలు, 287మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు ఖరారు చేశారు. వీటి పరిధిలో 8లక్షల 22,528 ఓటర్లతో సోమవారం ముసాయిదా జాబితాను విడుదల చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో 1607 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 400ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 263, 401 నుంచి 500 వరకు ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 497, 501 నుంచి 750వరకు ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 847 ఏర్పాటు చేశారు. వీటి జాబితాను అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచారు. వీటిపై అభ్యంతరాలను 13వ తేదీ వరకు స్వీకరించి వాటి ఆధారంగా అన్ని రాజకీయ పార్టీల అనుమతితో తుది జాబితాను 15న వెల్లడించనున్నట్లు జడ్పీ సీఈవో తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులే బలి తీసుకున్నాయా?

- భార్యను చంపి ఆత్మహత్య చేసుకున్న భర్త
- ఖమ్మం నగరంలో సంచలనం
- మృతులు ఏపీలోని నరసరావుపేట వాస్తవ్యులు



నరసింహారావు, కోటమ్మ మృతదేహాలు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భార్యను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన నరసింహారావు (65), కోటమ్మ(58) దంపతులు గత ఆరేళ్లుగా ఖమ్మంలోని బ్యాంక్ కాలనీ సమీపంలోని వేణుగోపాలనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. నరసింహారావు కొన్నేళ్లపాటు నగరంలోని పలు హోటళ్లలో వంటమాస్టర్‌గా పనిచేశాడు. భార్య కోటమ్మ ఇంట్లోనే ఉంటుంది. అయితే గత కొన్ని నెలలుగా వారిద్దరికీ అనారోగ్య సమస్యలు రావడంతో నరసింహారావు హోటల్ పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే సాయంత్రం ఫిల్టర్‌వాటర్ సరఫరా చేసే ఓ యువకుడు వారి ఇంటికి వచ్చి డోర్ కొట్టగా తీయలేదు. దీంతో కింది అంతస్థులో ఉంటున్న ఇంటి యజమాని వద్దకు వచ్చి విషయం చెప్పాడు. దీంతో ఇంటి యజమానితోపాటు పక్క పోర్షన్‌లో ఉంటున్న వారు పైకి వెళ్లి కిటికీ నుంచి చూడగా నరసింహారావు రక్తపు మడుగులో పడి కనిపించాడు. ఈ విషయం వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ బాలక్రిష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించింది.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ముందుగా నరసింహారావు భార్య కోటమ్మను సన్నటి తాడుతో గొంతు నులిమి హత్యచేసి ఆ తరువాత తన ఎడమ చేతి నరాలను కత్తితో కోసుకొని తరువాత భార్య మెడకు కట్టిన తాడును ఇంట్లో డోర్ పైన ఉండే బోల్ట్‌కి కట్టి తన మెడకు వేసుకుని మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. తొలుత చేతి నరాలను కట్ చేసుకున్న నరసింహారావు తన రక్తాన్ని ఓ గిన్నెలో పట్టి ఉంచాడు. అయినా చనిపోకపోవడంతో తాడుతో ఉరి వేసుకుని మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వారి చావుకు (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన పువ్వాడ, నామా

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి...

- మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్
- హైదరాబాద్‌లో ఖమ్మం నియోజకవర్గ శ్రేణులతో సమావేశం

6



కనుల పండువగా

సహస్ర కలశ ఆవాహన

- నేడు సహస్ర కలశాభిషేకం... భద్రాద్రిలో సందడి

6



ఇసుక దందాపై ఉక్కుపాదం

- 'ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక' నేపథ్యంలో చర్యలు
- సీఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తం
- బూర్గంపాడు ప్రాంతంలో ఐదు ట్రాక్టర్ల సీజ్
- భద్రాద్రి జిల్లాలో యథేచ్ఛగా అక్రమ రవాణా
- కొత్త ర్యాంపులకు టెండర్లు నిర్వహిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట

కొత్తగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీని కీలక బాధ్యులుగా, పర్యవేక్షక అధికారులుగా నియమించారు. పేదలు, సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వ ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఇసుక రీచ్‌లపై పర్యవేక్షణ పెంచేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. బూర్గంపాడు ప్రాంతంలో మంగళవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను అక్కడి రెవెన్యూ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేసి సీజ్ చేశారు.

విచ్చలవిడిగా ఇసుక దందా..

భద్రాద్రి జిల్లాలో అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. గోదావరి, కిన్నెరసాని తదితర జలవనరుల ప్రాంతాల్లో అనధికారికంగా ర్యాంపులు ఏర్పాటు చేసి ఒక్కొక్క యూనిట్ ఇసుకను రూ.1,000నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తున్నారు. వందలాది ట్రాక్టర్ల ద్వారా (మిగతా 6వ పేజీలో)



విద్యార్థులతో కళాశాల చైర్మన్ ప్రసాద్

జేఈఈ మెయిన్స్‌లో న్యూవిజన్ విజయకేతనం

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మంగళవారం విడుదలైన జేఈఈ మొదటి విడత ఫలితాల్లో నగరంలోని న్యూవిజన్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల చైర్మెన్ సీహెచ్‌జీకె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్ తెలిపారు. కళాశాలకు చెందిన అజ్మీరా రోషిక్ మణిదీప్ 99.892, పేరాల ప్రణయ్ 99.871, రమకౌశిక్ 99.647, దుగ్గినేని అనన్య 99.620, గుడె కార్తీక్ సాయి 99. 508, రంగు షణ్ముక ప్రియ 99.277, కంసాని మధురహాసిని చౌదరి 99.123, రచ్చ గుణదీప్ 99.114, తాటికొండ బ్రాహ్మణి 99.039, జవహర్ మహెక్ 98.868, చంద్రసాయి కృష్ణ 98.672 ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే జేఈఈ, అడ్వాన్స్, నీట్‌లో మా విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థులను కళాశాల చైర్మన్, అకాడమిక్ డైరెక్టర్, గోపీచంద్, ప్రిన్సిపాల్ అభినందించారు.



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ

జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాలో అగ్రగామిగా నిలిచారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన సాయిచరణ్ 99.986 పర్సంటైల్‌తో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు.

బి.సిద్ధార్థ్ 99.89, నవనీత్ 99.63, గౌతమ్ 99.44, నాగయశ్వంత్ 99.05, ఎన్‌సీహెచ్ జస్వంత్ 98.55, ప్రేమ్ వర్ధన్ 98.058, శ్రీనినాథ్ 97.77, సంజయ్ 97.05 పర్సంటైల్స్‌తో సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డిలు మాట్లాడుతూ 95 శాతానికి పైగా పర్సంటైల్‌ను 16 మంది విద్యార్థులు సాధించారని ఫిజిక్స్‌లో ఇద్దరు, కెమిస్ట్రీలో ఒకరు, నూటికి నూరు శాతం ఫలితం సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య

శ్రీచైతన్య జయకేతనం

జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలలో నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని కళాశాల చైర్మెన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. కళాశాలకు చెందిన వి.కుశాల్ 99.96, వై.నిశాంత్ 99.85, హెచ్.జశ్వంత్‌రామ్ 99.53, వి.ప్రణీత్ 99.44, ఆర్.జోష్నవ్‌కుమార్ 99.29, బి.ఈశ్వర్‌గుప్త 99.13, బి.భరత్ 99.02, జె.వెంకటేశ్వర్లు 98.58, బి.షైశేషు 98.50, ఐ.అను 68.49, స్మైలికరెడ్డి 98.39, సాయితేజ 98.32, యు.వశిష్ట 98.15 వంటి అత్యుత్తమ పర్సంటైల్‌తో విజమదుందుభి మోగించారని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మెన్, డైరెక్టర్లు మాట్లాడుతూ మారుతున్న పరీక్షా విధానాలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసి తులనాత్మకత విద్యాప్రమాణాలతో బోధనను అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సామిగీతిక, చేతన్ మాధుర్ వర్మ, బ్రహ్మం పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కృష్ణవేణి విజయదుందుభి

జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో నగరంలోని కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమి విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావులు తెలిపారు. కళాశాలకు చెందిన పి.మనిచంద్ర సాయి 99.67, డి.ఉమ మహేష్ 97.79, పి.సుందరయ్య 96.14, పి.శ్రీమంత్ 95.76, కె.మహేష్‌బాబు 95.57, జి.సాహిత్ 94.70, పి.యశస్వి 93.37, ఎస్.సాయిసంజన 93.17, బి.రోహిత్‌గని 92.94, కె.వైష్ణవి 92.93, ఆర్.సీతా రామకృష్ణ 91.70, బి.లక్ష్మీచందు 91.42, దానేష్ 90.01, మహాతేజ 90.00 వంటి పర్సంటైల్ సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

రెజోనెన్స్ విజయభేరి

జేఈఈ మొదటి విడత ఫలితాల్లో నగరంలోని రెజోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కళాశాల డైరెక్టర్లు ఆర్వి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావులు తెలిపారు. కళాశాలకు చెందిన కె.వరణ్ 99.08, ఎమ్.సుశాంత్ 98.29, ఎమ్.హర్ష 98.85, ఎమ్.భార్గవ్ 96.08, కె.ధాన్యదీప్ 95.60, తరుణ్‌రెడ్డి 93.86, జి.దర్శినిశ్రీ 93.84 పర్సంటైల్ సాధించారని తెలిపారు. రానున్న జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో మరెన్నో విజయాలు సాధిస్తామన్నారు. సుమారు 75శాతం మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

మండలి సైన్స్ సెమినార్‌కు నలుగురు ఉపాధ్యాయుల ఎంపిక

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన మండలి నిర్వహించే విద్యా శిక్షణ పరిశోధన మండలి సైన్స్ సెమినార్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.

ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవ ఇతివృత్తంగా 'సైన్స్ ఇన్ అవర్ వరల్డ్' అనే అంశం ఎంపికైంది. దీనికి సంబంధించి ఆర్టికల్స్‌ను పంపించాల్సి ఉండగా.. తెలంగాణలోని 33 జిల్లాల వ్యాప్తంగా 196 పరిశోధన పత్రాలు అందించారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి 31 పరిశోధనలను కమిటీ అర్హులుగా ప్రకటించారు. ఎంపికైన పరిశోధన పత్రాలను ఫిబ్రవరి 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవంలో ప్రజెంటేషన్ చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్ రెడ్డి, ఖమ్మం జిల్లా వేంసూర్ మండలంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఏ రాంబాబు, భద్రాద్రి కొత్తగుడెం జిల్లా జెడ్పీహెచ్ఎస్ రామానుజవరంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వివి కోటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం బాబు క్యాంపులో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ సునందినిలను తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన మండలి సైన్స్ సెమినార్‌కు ఎంపిక చేశారు.

ఈ నెల 28న ఎంపికైన వారు హైదరాబాద్ మండలిలో పేపర్లను ప్రజెంట్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 22న ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించాలని తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన మండలి డైరెక్టర్ రమేష్ ఆదేశాలు జారీ చేశారు. ఎంపికైన ఉపాధ్యాయులను ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్‌లు అభినందించారు.

నేడు గద్దెలపైకి సారలమ్మ, పగిడిద్దరాజు

ఏర్పాట్లను పరిశీలించిన మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కరకగూడెం/ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమళ్ల పంచాయతీలో అత్యంత వైభవంగా జరగనున్న సమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. మంగళవారం రాత్రి ఆలయం వద్ద పూజారులు మండెమెలుగు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం వెంకటాపురం పంచాయతీ దేవరనాగారం నుంచి సాలరమ్మ, వేల్పులను పూజారులు తీసుకొస్తారు. ములుగు జిల్లా వెంకటాపురం ఎదిర గద్దెల నుంచి పగిడిద్దెరాజును తీసుకొస్తారు. వీరిద్దరికీ ఆదివాసీ సంప్రదాయాలతో చిరుమళ్ల గ్రామంలో ఎదురుకోలు నిర్వహించి సారలమ్మను, పగిడిద్దెరాజును గద్దెలపై కొలువు తీర్చుతారు. అనంతరం కుంకుమ పూజలు, అర్చనలు, ఒక్కపొద్దు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు జిల్లాలను నుంచి వచ్చే వడ్డేలు, వేల్పులను గుడికి చేర్చుతారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన మణుగూరు డీఎస్పీ

చిరుమళ్ల సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లను మంగళవారం మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆలయం చుట్టు పరిసరాలను, జాతరకు వచ్చే వేల్పులు, భక్తులకు ఏర్పాటు చేసిన వసతులు, వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు.

నేటి నుంచి బొజ్జాయిగూడెంలో మినీ మేడారం జాతర

ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో జరిగే మినీ మేడారం జాతరకు అధికారులు, ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. మూడు రోజులపాటు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు ఇల్లెందు పట్టణం, టేకులపల్లి, కారేపల్లి, బయ్యారం, గుండాల, ఆళ్లపల్లి, గంగారం మండలాల నుంచి ప్రజలు పెద్దఎత్తున్న తరలివస్తారు. పెద్ద మేడారం తరహాలోనే ప్రతీ ఏడాది బొజ్జాయిగూడెం సమ్మక్క-సారలమ్మ చిన్న జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు సమ్మక్క-సారలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొర్సా కోటయ్య, మాజీ సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం అమ్మవార్లకు బోనాలతో జాతర ప్రారంభమవుతుందని వారు వివరించారు. ఈ సమావేశంలో తెల్లం వెంకన్న, సారయ్య, మునిబాబు, బిజ్జా కోటేష్, రాజు, వర్స అంజయ్య, బాలకృష్ణ, గొగ్గెల రాంబాబు, ముత్తయ్య, ఊకే ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వన దేవతలను దర్శించుకోనున్న మంత్రి సీతక్క

విలేకరుల సమావేశంలో చందా లింగయ్య

కరకగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొర తెలిపారు. మంగళవారం చిరుమళ్ల గ్రామంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం నిండు జాతర సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం ఎమ్మెల్యేలు, ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య వన దేవతలను దర్శించుకోనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి: పీవో

చర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు పాఠాలు అర్థం అయ్యేలా బోధించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం చర్ల మండలంలోని పెద్దమిడిసిలేరు ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. బోధనా విధానం, అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. గణితం, ఇంగ్లీష్ సజెక్టుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల గదులు, డైనింగ్‌హాల్‌ని పరిశీలించారు. పీవో వెంట వార్డెన్ ఈశ్వర్, మురళీకృష్ణ, చంద్రకళ, విద్యార్థులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులే బలి తీసుకున్నాయా?

(5వ పేజీ తరువాయి)

గల కారణాలను వివరిస్తూ మృతుడి జేబులో ఒక లెటర్, కిటికీ సమీపంలో మరో లెటర్ ఉన్నట్లు తెలిసింది. వాటిని టూటౌన్ సీఐ బాలక్రిష్ణ సేకరించినట్లు తెలిసింది. ఈ ఘటనపై సీఐ బాలక్రిష్ణను వివరణ అడుగగా భార్యను హత్యచేసి తానూ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులు ఎవరూ ఖమ్మంలో లేరు. దీంతో వారి పూర్తి వివరాలు తెలియకపోవడంతో అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు కూడా సమాచారం అందించినట్లు తెలిసింది.

కాగా, నరసింహారావు సూసైడ్ నోట్‌లో ఏం రాశాడనేది మిస్టరీగా మారింది. మృతుడి నుంచి లెటర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అందులోని వివరాలను రహస్యంగా ఉంచారు. రెండు రోజుల తర్వాత పూర్తి వివరాలు తెలుపుతామని సీఐ బాలకృష్ణ చెప్పారు.

ఎవరితో ఎక్కువగా మాట్లాడరు..

నరసింహారావు, కోటమ్మ దంపతులు ఎవరితో ఎక్కువగా మాట్లాడే వారు కాదని, తమ పని తాము చూసుకునే వారని ఇంటి చుట్టుపక్కల వారు చెబుతున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఇద్దరూ చికిత్స పొందుతున్నారని, వారి కుటుంబ సభ్యుల వివరాలు కూడా ఎవరికీ తెలిపేవారు కాదన్నారు. తమకు ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారిలో ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు తమ సొంత ఊరిలోనే ఉంటారని చెప్పేవారని స్థానికులు తెలిపారు. అయితే ఆ ఇద్దరు కూతుర్లలో ఒక్కరు కూడా వారి వద్దకు రాలేదని తెలిసింది. నరసింహారావు దంపతులు ఆర్థిక సమస్యలతో ఇంటి యజమాని నుంచి రూ.20వేలు తీసుకున్నట్లు తెలిసింది.



నరసింహారావు (ఫైల్)

బీరు ప్రియులపై భారం

●రూ.20 నుంచి రూ.40 వరకు ధర పెంపు

●పెరిగిన ధరల ప్రకారం నేటి నుంచి సరఫరా

వైరా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీర్ల ప్రియులపై ఏడాదికి రూ.వందకోట్ల భారం పడనుంది. ఒక్కో బీరుకు రూ.20నుంచి రూ.40వరకు ధరలు పెరిగాయి. బీర్ల కంపెనీల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు ప్రభుత్వం ఈ ధరలను పెంచింది. కొన్నిరకాల బీర్లు బాటిల్ ఒక్కింటికి రూ.20చొప్పున, అలాగే మరికొన్ని రకాల బీర్లకు రూ.30, రూ.40చొప్పున రేట్లు పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా 20లక్షల బీర్ల పెట్టెలు విక్రయిస్తున్నారు. ఒక్కో బీరు పెట్టెకు రూ.450నుంచి రూ.500వరకు రేట్లు పెరిగాయి. దీని ఫలితంగా బీర్ల ప్రియులపై ఏడాదికి రూ.100 కోట్ల వరకు భారం పడనుంది.

ధరల పెరుగుదల నేపథ్యంలో మంగళవారం ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా బీర్ల సరఫరాను నిలిపివేశారు. బీర్ల కంపెనీల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ధరలను పెంచినట్లు సోమవారం ప్రభుత్వం ప్రకటించింది పెరిగిన రేట్ల వివరాలు వచ్చిన తర్వాత మాత్రమే బీర్ల సరఫరా చేయాలని అప్పటివరకు సరఫరా నిలిపివేయాలని రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ నుంచి వచ్చిన ఆదేశాలతో బీర్ల సరఫరా నిల్చిపోయింది. దాదాపు రూ.ఒకటిన్నర నుంచి రెండుకోట్ల వరకు బీర్ల సరఫరా నిల్చిపోయిందని అంచనా. అయితే పెరిగిన ధరలకు సంబంధించిన ఆదేశాలు మంగళవారం సాయంత్రం ఆరుగంటల తర్వాత వైరాలోని ఐఎంఎల్ డిపోకు చేరాయి. దీంతో కొత్త రేట్ల ప్రకారం బుధవారం నుంచి సరఫరా చేయనున్నారు. ఇప్పటికే వైన్‌షాపుల్లో ఉన్న బీర్లను కూడా పెరిగిన ధరల మేరకు విక్రయించుకొని వైన్‌షాపుల యజమానులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి..

● మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ

● హైదరాబాద్‌లో ఖమ్మం శ్రేణులతో సమావేశం

ఖమ్మం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి జరపాలని మాజీ మాజీ మంత్రులు కే.తారకరామారావు, పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పువ్వాడ ఇంటిలో ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీమంత్రులు కేటీఆర్, పువ్వాడ, మాజీ ఎంపీ నామా మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గ్రామస్థాయి నుంచి ప్రతీ ఒక్కరు శ్రమించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జిల్లాలో అత్యధిక స్థానాలు గెలిచి కేసీఆర్‌కు కానుక ఇద్దామన్నారు. రాష్ట్రంలో ప్రజలు బీఆర్ఎస్ పాలన మెచ్చుకుంటున్నారని, కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, ఆర్‌జేసీ కృష్ణ, సుడా మాజీచైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బొమ్మెర రామ్మూర్తి, కార్పొరేషన్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు పగడాల నాగరాజు, రఘునాథపాలెం అధ్యక్షుడు వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దందాపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

నిత్యం ఇసుక తరలిస్తున్నారు. అధికార పార్టీ అండదండలతో అక్రమార్కులు ఇసుక దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి పనులకు, గృహ అవసరాల కోసమే ఇసుక తరలిస్తున్నామని పైకి చెబుతున్నా.. అంతర్గతంగా మాత్రం అక్రమ వ్యాపారమే సాగుతోంది. జిల్లాలో ఇప్పటివరకు అధికారికంగా ఇసుక టెండర్లు సక్రమంగా చేపట్టలేదని, ఇప్పటికైనా టెండర్లు నిర్వహించి ఇసుక రవాణాకు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలో ముర్రేడు, కిన్నెరసాని, గోదావరి ఇసుకకు భారీ డిమాండ్ ఉండటంతో హైదరాబాద్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. కొత్తగూడెం పరిసర మండలాలైన చుంచుపల్లి, బూర్గంపాడు, మణుగూరు, పినపాక, అశ్వాపురం, ఆళ్లపల్లి, గుండాల, చర్ల, దుమ్ముగూడెం తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

ఈ ఇసుక అక్రమరవాణాపై గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై సీఎం సమీక్ష సమావేశం నిర్వహించి ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. జిల్లాలో పినపాక డివిజన్‌లో 8, భద్రాచలం డివిజన్‌లో 9 ఇసుక ర్యాంపులో ఉన్నాయి. గిరిజన సొసైటీ ఆధ్వర్యంలో ఈ ర్యాంపులను నిర్వహిస్తున్నారు. వీటిలాగే జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని సొసైటీల ద్వారా టెండర్లు నిర్వహించి ఇసుక రవాణా చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

ప'రేషన్' కార్డులు

(5వ పేజీ తరువాయి)

వివరాలు నమోదు చేస్తున్నారు. ఇది కొనసాగుతున్న సమయంలోనే ప్రభుత్వం మీ-సేవా కేంద్రాల్లో నూతన రేషన్‌కార్డులకు, సవరణకు అవకాశం ఇవ్వడంతో ప్రజల్లో అయోమయ స్థితి నెలకొంది. వారు దరఖాస్తు చేసుకోవాలా? లేదా? అన్న విషయంపై అవగాహన లేకపోవడంతో మీ-సేవా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. గతంలో గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్నా మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. దాంతో మీ-సేవ కేంద్రాల వద్ద రద్దీ భారీగా పెరిగింది. గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్న వారు కూడా మళ్లీ మీ-సేవల్లో దరఖాస్తు చేస్తున్న నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. అయితే గతంలో చేసిన దరఖాస్తుల డేటాఎంట్రీ కార్యక్రమం జరుగుతున్నందున ఆయా గ్రామసభల్లో దరఖాస్తు చేయనివారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కొందరు అధికారులు చెబుతున్నారు.

ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై రాకపోకలు షురూ

(5వ పేజీ తరువాయి)

తర్వాతనే రాకపోకలు ప్రారంభించాలని నిపుణులబృందం సూచించడంతో ఆర్‌అండ్‌బీ టెండర్లు పిలిచి పనులు పూర్తిచేసింది. సుమారు రూ.కోటి ఖర్చుతో జాకీల ద్వారా స్పాన్లు సరిచేసి బ్రిడ్జిని మళ్లీ యధాక్రమంలో ఉంచారు. స్పాన్లకు మధ్య ఉన్న గ్యాప్‌ను తొలగించి బ్రిడ్జిలోని అన్ని స్లాబులను సమానంగా అనుసంధానం చేశారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రాకపోకలు ప్రారంభం

మున్నేరు ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపైనా రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ చేనేత జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ యరగర్ల సత్యనారాయణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, కాంగ్రెస్ నాయకులు సాధురమేష్‌రెడ్డి, పాలెపు వెంకటరమణ తదితరులు బ్రిడ్జిపై నడుచుకుంటూ వచ్చారు.

ప్రజల ఇబ్బందులు తొలిగాయి: మంత్రి

ప్రకాష్‌నగర్ బ్రిడ్జినుంచి రాకపోకలు ప్రారంభం కావడంతో ప్రజల ఇబ్బందులు తొలిగాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మున్నేరు వరదల వల్ల బ్రిడ్జిపైన స్పాన్లు ఒరిగిపోవడంతో నిపుణుల కమిటీ సూచన మేరకు రూ.కోటి ఖర్చుతో మరమ్మతులు చేయించామని, సాంకేతిక పరిజ్ఞానంతో బ్రిడ్జి యథాస్థితిలో కూర్చోపెట్టి వంతెనకు నష్టం రాకుండా రాకపోకలు ప్రారంభించామని తెలిపారు. ఖమ్మం మార్కెట్‌కు ప్రతిరోజు పెద్దఎత్తున మిర్చి వస్తున్న సమయంలో లారీలు, ట్రాక్టర్లన్నీ ఈ వంతెన మీద నుంచి వెళ్లాలని ప్రస్తుతం యథాస్థితికి రావడం ద్వారా రవాణ ఇబ్బందులు తొలిగాయని, ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బందులు తొలిగాయని తెలిపారు.

రామాలయంలో సహస్ర కలశ ఆవాహన

భద్రాచలం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో సహస్ర కలశాభిషేక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సహస్ర కలశ ఆవాహన గావించారు. పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం ప్రతి ఏటా మాఘ పౌర్ణమినాడు సహస్ర కలశాభిషేకం నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా సహస్ర కలశాభిషేక మహోత్సవాలకు సోమవారం అంకురార్పణ గావించగా.. మంగళవారం అగ్ని ప్రతిష్ఠ, హోమం, సహస్ర కలశ ఆవాహన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. బుధవారం సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఈ అభిషేకాన్ని లోకం సుభిక్షంగా ఉండటంతోపాటు ప్రజలు సుఖశాంతులతో తులతూగాలని నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా సహస్ర కలశాభిషేక మహోత్సవాలను పురస్కరించుకొని సీతారామచంద్రస్వామికి మంగళ, బుధవారాల్లో నిత్య కల్యాణాలను నిలిపివేశారు. అదేవిధంగా పవళింపు సేవలను నిర్వహించడం లేదు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు అమరవాది వెంకట్రామన్ పాల్గొన్నారు.

నేడు రంగనాయకస్వామి కల్యాణం

భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీరంగనాయకస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణం బుధవారం నిర్వహించనున్నారు. ప్రతీ ఏటా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.

జేఈఈ మెయిన్స్‌లో 'ప్రైవేటు' సత్తా

(5వ పేజీ తరువాయి)

బి.సాయిచరణ్ 99.986 పర్సంటైల్‌తో ఖమ్మం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన సాయిచరణ్ తల్లిదండ్రులు అనిల్‌కుమార్, కల్పనలు గ్రామంలో చిన్న కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్నారు. సాయిచరణ్ పదోతరగతి దంతాలపల్లి సెయింట్ మేరీస్ హైస్కూల్లో చదివాడు. ఇంటర్మీడియట్ హార్వెస్ట్‌లో చదువుతున్నాడు. అలాగే నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి వి.కుశాల్ 99.96, న్యూవిజన్ జూనియర్ కళాశాల విద్యార్థి అజ్మీరా రోషిక్ మణిదీప్ 99.892 పర్సంటైల్స్ సాధించారు.

సారపాక మాజీ సర్పంచ్, కార్యదర్శికి

రెండేళ్ల జైలుశిక్ష

▸▸ పుష్కరకాలం తరువాత తుది తీర్పు వెల్లడి

భద్రాచలం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సారపాక మేజరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్, కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావులకు నిధుల దుర్వినియోగం కేసులో ఇరువురికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమాన విధిస్తూ మంగళవారం భద్రాచలం న్యాయాధికారి శివనాయక్ తీర్పు వెల్లడించారు. 2013లో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో సారపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూ.23 లక్షల నిధుల దుర్వినియోగం అంశంలో వీరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు భద్రాచలం న్యాయస్థానంలో పుష్కర కాలంపాటు వాదనలు సాగగా మంగళవారం తుది తీర్పును న్యాయాధికారి శివనాయక్ వెల్లడించారు.

ఈ తీర్పు వెల్లడించే సమయంలో న్యాయాధికారి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. 'అవినీతి అంటే కేవలం డబ్బు చేతులు మారడం మాత్రమే కాదు, సమాజంపై నమ్మకం దెబ్బతినడం, అవినీతి అనేది పేదల నుంచి దొంగిలించే, పాలన, నైతిక బలాలను బలహీనపర్చే, నాశనం చేసే క్యాన్సర్‌గా పేర్కొన్నారు.

ఈ కేసులో ప్రభుత్వం తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కాగా స్థానిక ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఈ తీర్పు వెలువడటంతో రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.

రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులు



రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులు

తల్లాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రసాయి మహామేధ జ్ఞాన(జీకే) పోటీల్లో తల్లాడ బాలభారతి విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో అక్షర నిర్మాణ ఫౌం డేషన్ నిర్వహించిన జీకేలో బాలభారతి విద్యాలయం విద్యార్థులు ఎస్.లక్ష్మీశ్రీజ ప్రథమ, సుధా అవినాష్ ద్వితీయ, సుంకర పూజిత తృతీయ బహుమతులు సాధించారు. విజేతలైన ముగ్గురు విజేతలకు ప్రముఖ సినీ గేయ రచయితలు జయరాజు, ఎస్పాల్ బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ఎంఈవో ఎస్.దామోదర్ ప్రసాద్, సంచాలకులు కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ప్రిన్సిపల్ తాళ్లూరి రామారావు, ఏవో యాచమనేని శశాంత్ అభినందించారు.

మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టాలి

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వినియోగం.. అక్రమ రవాణ అరికట్టడంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి దేవరపల్లి కీర్తి చంద్రక రెడ్డి అన్నారు. మంగళవారం ఇల్లెందు కోర్టు ఏరియాలో ఎస్టీ గిరిజన వసతిగృహంలో న్యాయచైతన్య సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయాధికారి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వాటి వల్ల కలిగే దుష్ఫలితాలు, అక్రమ రవాణను అరికట్టడంపై చిన్న వయస్సు నుంచి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఏర్పడుతున్న దుష్ఫలితాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వలన అనేక అనర్థాలు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం వసతిగృహ వంటశాలను పరిశీలించారు. న్యాయాధికారి వెంట ఇల్లెందు బార్ అ సోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ కీర్తి కార్తిక్, న్యాయవాది వీరేంద్రబాబు, వార్డెన్ భరత్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఇసుక రవాణా నియంత్రణకు కఠిన చర్యలు

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు.. పోలీస్, భూగర్భజల, మైనింగ్‌శాఖ అధికారులతో పోలీస్ కమిషనర్ సమావేశం



ఖమ్మంక్రైం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణ నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అధికారులను ఆదేశించారు. మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాయినాథ్, భూగర్భజల శాఖ అసిసిస్టెంట్ అధికారి రమేష్, ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావులతో కలిసి మంగళవారం సీపీ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమరవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రాంతాల్లోనే రాయల్టీరుసుం చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని వాగులు, నదీ పరివాహక ఇసుక తవ్వకాల ప్రాంతాలు గుర్తించి నిగా ఏర్పాటచేయాలని, చెక్‌పోస్టుల ద్వారి ఇసుక అక్రమరవాణపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణ చేసినా నిలవ ఉంచినా వెంటననే చట్టపరంగా జరిమానాలు విధించడం, కేసులు నమోదుచేయడం వాహనాలు జప్తుచేయాలని సూచించారు. అధికారులంతా ఇసుక అక్రమరవాణపై నిరంతరం నిఘా ఉంచాలని, మైనింగ్ అధికారులు పోలీసుశాఖ సమన్వయంతో ఈఅక్రమరవాణ పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఆదేశించారు. జీరోబిల్లులు, డబుల్‌ట్రిప్, అదనపు లోడు, నకిలీ బిల్లులు, తప్పుడు వాహనాలతో రవాణ, తప్పుడు గమ్యస్థానం లాంటి ఉల్లంఘన అక్రమాలపై కూడా కేసులు నమోదుచేయాలని ప్రదాన నిర్వాహకుల పేర్లను తప్పకుండా బయటకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా జిల్లాలో పలు ప్రాంతాలలో చెక్‌పోస్టులు కూడా ఏర్పాటుచేసినట్లు సీపీ తెలిపారు.

కమిషనరేట్ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు

కారేపల్లి మండలం కొత్తలింగాల క్రాస్‌రోడ్, ముదిగొండ మండలం వల్లభి, బోనకల్ మండలం శివారులోని వత్సవాయివద్ద, మధిర సమీపంలోని ఆత్కూరు క్రాస్‌రోడ్డు వద్ద, సత్తుపల్లి సమీపంలోని గంగారం రింగ్ సెంటర్‌వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఈచెక్‌పోస్టులలో మైనింగ్ స్టాఫ్ తోపాటు పోలీసుసిబ్బంది, మూడు షిఫ్టులలో 24గంటలు పనిచేసేలా ఏర్పాట్లు చేసినట్టు సీపీ తెలిపారు.

నేడుఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతోంది. దశల వారీ కార్యక్రమాలు చేస్తూ ఎన్నికల తేదీ ప్రకటించే నాటికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలతో పాటు 20 మండలాల పరిదిలో 288 ఎంపీటీసీ స్థానాలున్నాయి. గతంలో 20 జడ్పీటీసీ స్థానాల్లో రెండు బీసీ, జనరల్ స్థానాల్లో రెండు, మిగిలినవి ఎస్సీ,ఎస్టీ జనరల్ స్థానాలు ఉన్నాయి. 289 స్థానాల్లో బీసీ రిజర్వేషన్ 31, జనరల్ స్థానాల్లో బీసీలు 36 మొత్తం 67 స్థానాలను బీసీలకు కేటాయించారు. మిగిలిన వాటిల్లో ఎస్సీ, ఎస్టీ, జనరల్‌గా కేటాయించారు. అయితే ఇంకా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయలేదు. ఈ ప్రక్రియను గురువారం హైదరాబాద్‌లో కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించిన తర్వాత రిజర్వేషన్ల అమలు కేటాయింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈయితే వీటి పరిధిలో పోలింగ్ నిర్వహణ అంతా ఆర్వో, ఏర్వోలు పీవో, ఓపీవోల పైనే ఆధారపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించేందుకు ముందు ఎన్నికల నిబంధనల అమలుపై శిక్షణ ఇవ్వడం ఆనవాయితీ. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. 20 మండలాల పరిధిలో పోలింగ్ నిర్వహణకు గాను జడ్పీటీసీ పోలింగ్‌కు 23 మంది ఆర్వోలు, 288 ఎంపీటీసీ స్థానాలకు గాను 117 మంది ఆర్వోలు, 120 మంది ఏఆర్వోలను నియమించారు.

వీరందరికీ బుధ, గురు వారాలు రెండు రోజుల పాటు ఎస్సార్‌బీజీఎన్నార్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. వీరితో పాటు రెండో విడతగా పీవోలు, ఓపీవోలను విధులు నిర్వర్తించడానికి ఎంపిక చేస్తున్నారు. ఆయా మండలాల్లో ఎక్కడివారికక్కడే శిక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

మహిళా సమాఖ్య సభ్యులచే వెదురుసాగు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

కొత్తగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఐదు జిల్లాలకు వెయ్యి మంది చొప్పున 5వేల మంది మహిళా సమాఖ్య సభ్యులచే వెదురుసాగు ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్ణయించడం జరిగిందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తెలిపారు. మంగళవారం కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో రెండో రోజు ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వెదురు సాగుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ జిల్లాలోని చంద్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడం జరిగిందని ఈ మండలాల్లోని 1000మంది మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించి వారికి వెదురు సాగుపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వీరికి ఉపాధి హామీ పథకం ద్వార మొక్కలు సరఫరా, నిర్వహణ కొరకు నిధులు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు.వెదురు మొక్కలు నాటిన తర్వాత నాలుగు సంవత్సరాలకు దిగుబడి ప్రారంభమవుతుందని, అప్పటి నుంచి 80 సంవత్సరాల వరకు ప్రతి సంవత్సరం వెదురు దిగుబడి అమ్మడం ద్వార రైతు ఆధాయం గడించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించి సర్టిఫికెట్, మార్కెటింగ్‌కు సంబంధించి సెర్ప్, ఇండస్ట్రీ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో నీలేష్, మూడు మండలాల డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు,ఏపీవోలు, ఎఫ్‌పీవోలు, బీవోడీలు, ఉద్యాన వనశాఖాధికారులు, అటవీశాఖాధికారు లు, ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాచందన

మేము వసూళ్లు చేయలేదు సార్..

'బయట విందు.. లోపల మందు' వార్తపై అధికారుల విచారణ

ఖమ్మం క్రైం,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): దాబాల నుంచి, వైన్ షాపుల నుంచి పోలీసులు వసూళ్లకు పాల్పడుతున్న సంఘటనపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం అయిన విషయం విదితమే. ఈ కథనంపై పోలీస్ శాఖలో చర్చ జరిగింది. ఎక్కడ వసుళ్ల జరుగుతున్నాయి... ఎవ్వరు వసూళ్ల చేస్తున్నారు.. అన్న విషయంపై పోలీస్ శాఖలోని ఉన్నాతాధికారులు ఆరా తీసినట్టు తెలిసింది. కథనాన్ని పలువురు అధికారులకు వాట్సాప్ ద్వారా పంపి ఎవ్వరు చేస్తున్నారని అడగడంతో మాకు తెలియదు సార్... మా పరిధిలో కాదు మా దగ్గర ఎవరూ వసుళ్ళకు పాల్పడటం లేదు సార్ అని అధికారులు కూడా వివరించినట్టు సమాచారం. తరువాత కొందమంది కిందిస్థాయి అధికారులు చర్చిస్తూ జరుగుతున్న మాట వాస్తవమే... ఇటీవలె నా దృష్టికి వస్తే సిబ్బందికి కూడా వార్నింగ్ ఇచ్చానని ఓ అధికారి అన్నారంటూ... సిబ్బంది అందరు కాదు గన్ మెన్‌లు కూడా ఇలాంటి పనులు చేస్తున్నారని మరో అధికారి కూడా అన్నట్టు తెలిసింది. అదేవిధంగా వచ్చిన కథనం నిజమేనని పలువురు అధికారులు కూడా అన్నారు.

మామూళ్లు ఇవ్వడంలేదని ఆన్‌లైన్ కేసులు?

మామూళ్లు ఇవ్వడంలేదని పోలీసులు ఫోటోలు తీసి ఆన్‌లైన్ లో కేసులు నమోదు చేస్తున్నారని తెలిసింది. గతంలో దాబాల యజమానులు, వైన్ షాపులు యజమానుల నుంచి ప్రతి నెలా డబ్బులు వసూల్ చేసేవారని, కొంత మంది డబ్బులు ఇవ్వకుంటే వారికి ట్యాబ్ ద్వారా ఫోటోలు తీసి కేసులు కూడా నమోదు చేశారని తెలిసింది. స్టేషన్ల అధికారుల పేర్లు చెప్పి సిబ్బంది రెస్టారెంట్లలో సైతం ఫుడ్‌ను తీసుకు వెళుతున్నారని, ఇవ్వకుంటే అధికారులకు ఫోన్ చేయడంతో వారు కూడా ఫుడ్ ఇవ్వాల్సిందేనని అంటున్నారని కూడా తెలిసింది.

రేపు భద్రాద్రి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

చుంచుపల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా స్థాయి యూత్ అథ్లెటిక్స్ ఎంపికలు గురువారం నుంచి పాల్వంచ శ్రీనివాసకాలనీలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పోటీల్లో 18 సంవత్సరాల లోపు బాల, బాలికలకు 100, 400, 800, 1500, 3000, 5000 మీటర్ల పరుగు పందెం, వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కావున జిల్లాలోని క్రీడాకారులు అథ్లెటిక్ కోచ్ పి.నాగేందర్ 9963659598 రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.హనుమంతురావును 7207402792 సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

పోలింగ్ విధుల పట్ల అవగాహన ఉండాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



కొత్తగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27న జరగనున్న పోలింగ్ పక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. జిల్లా పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు మొత్తం 74మందికి ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళారం మొదటి విడత శిక్షణ తరగతులను నిర్వహించారు. పీవోలు, ఏపీవోలను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పక్రియ భిన్నంగా ఉంటుందన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలైన్‌లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారితో ఓటింగ్ జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్‌బాక్సులను పీవోలు తమ పర్యవేక్షణలోనే ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వర చారి, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీఎల్‌ఎంటి పూసపాటి సాయి కృష్ణ, కిరణ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మధిరటౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మధిర రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన కొత్తూరు ప్రదీప్ కుమార్(34) జైపూర్ నుంచి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

మనస్తాపంతో వివాహిత...

పాల్వంచ,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపాల్వంచకు చెందిన మైలవరపు ప్రశాంతికి (38) అదే ప్రాంతానికి చెందిన కటారు రవిశేఖరశాస్త్రితో 2011లోవివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం కూడా ఉన్నారు. సోమవారం ప్రశాంతి తాను ఊరు వెళతానని భర్త శేఖర్‌కు చెప్పడంతో అతను పిల్లల చదువులు పాడవుతాయని ఆమెకు సర్ధిచెప్పడానికి ప్రయత్నించాడు. ఈ విషయంలోనే వారిమధ్య చిన్న మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఉదయం శేఖర్ లేచి చూసే సరికి ఆమె ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో శేఖర్ పెద్దగా కేకలు వేయడంతో ఇంటి చుట్టు పక్కల వారు అక్కడకు చేరుకుని ఆమెను కిందకు దించి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెంది ఉందని నిర్ధారణకు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి మేనమామ చందూరి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

రూ.91 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన చింతల రవికుమార్ రూ.91,04,593లకు దివాళా పిటీషన్ దాఖలు చేశాడు. ఫిర్యాదిదారుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేటు వ్యక్తులు, అధిక మొత్తంలో అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టం రావడంతో రుణదాతల నుంచి ఒత్తిడి తీవ్రం అయింది. దీంతో 10 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్ జడ్జికోర్టులో దివాళా పిటీషన్ దాఖలుచేశారు. తనను దివాళాదారుగా ప్రకటించమని పిటీషన్‌లో కోర్టును అభ్యర్థించారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

చంద్రుగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాలికను మోసగించిన కేసు విషయంపై మంగళవారం కొత్తగూడెం డీఎస్పీ రెహెమాన్ చంద్రుగొండలోని అంబేడ్కర్ కాలనీలో విచారణ నిర్వహించారు. మోసగించిన రావికంపాడు గ్రామానికి చెందిన వినోద్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటనపై కొత్తగూడెం డీఎస్పీ కాలనీలోని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. విచారణలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఏఎస్ఐ పాపయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో సింగరేణి ఉద్యోగి మృతి

మణుగూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణికాలరీస్ మణుగూరు ఏరియాలోని సివిల్ డిపార్టుమెంట్‌లో పంప్ ఆపరేటర్‌గా పనిచేసే దూళికట్ల సురేష్ (43) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. సురేష్ తెల్లవారుజామున ఛాతినొప్పితో ఇబ్బంది పడుతుండగా కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు కృష్ణంరాజు గట్టయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని పినపాకపట్టినగర్ సమీపంలో గల కిన్నెరసాని వాగు నుంచి సోమవారం రాత్రి సమయంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. డీటీ రాంనరేష్ సిబ్బందితో కలిసి దాడులు చేపట్టగా ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న పది ట్రాక్టర్లను గుర్తించినట్లు తెలిపారు. ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన వారు అధికారులను చూసి పారిపోయినట్లు తెలిపారు. కాగా మంగళవారం అదే ప్రదేశంలో నిల్వ ఉంచిన సుమారు 30ట్రాక్టర్ల ఇసుకను ఆర్ఐ నరసింహరావు సిబ్బందితో కలిసి సీజ్ చేశారు.

పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మంగళవారం భక్త రామదాసు కళాక్షేత్రంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 577 గ్రామ పంచాయతీలు, 5266 వార్డుల పరిధిలో మొత్తం 5284 పోలింగ్ కేంద్రాలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి, వోపీవో లతో పోలింగ్ బృందాలను 20శాతం బఫర్‌తో కలిపి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 6,349 మంది పోలింగ్ అధికారులు, 7,898 ఓపీవోలను ఆన్‌లైన్ సాఫ్ట్ వేర్ వినియోగించి పారదర్శకంగా మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ కేటాయించిన ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ఆర్డీవోలు నరసింహారావు, ఎల్. రాజేందర్, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగ పద్మజ, డీఎల్పీవో రాంబాబు పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకు కృషి

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



నాగబాబు కుమారుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 11: తెలంగాణ, ఆంధ్ర ఉమ్మడి రాష్ట్రాలకు సంబంధించి అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి సమీపంలో గల పెదవాగుప్రాజెక్టు మరమ్మతులకు సంబందించిన సమస్యను ఈనెలాఖరులో ప్రారంభమయ్యే ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. అశ్వారావుపేటలో జనసేన పార్టీ నాయకులు ఉమాదేవి, నాగబాబునాయుడు కుమారుడు సాయిబాలాజీ కొద్దిరోజుల క్రితం అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, ఆ కుటుంబాన్ని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో కలిసి మంగళవారం పరామర్శించారు.

అనంతరం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గతేడాది పెదవాగు ప్రాజెక్టు కట్టతెగటం ద్వారా ఆంధ్రాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో అనేక గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయని, పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. ప్రాజెక్టు తెలంగాణాలో, ఆయకట్టు ఆంధ్రాలో ఉండటం ద్వారా అంతరాష్ట్ర సమస్య ఏర్పడుతుందని, దీనిపై ఇప్పటికే తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పలుమార్లు మాట్లాడటం జరిగిందన్నారు.

ప్రాజెక్టుకు సంబందించిన సమస్యను గతంలోనే అసెంబ్లీలో చెప్పానని, తిరిగి మరోసారి సమస్యను లేవనెత్తి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను పక్కన పెట్టి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు సమస్య పరిష్కారానికి ఇరు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.రవికుమార్, రాము, అంకత మల్లికార్జునరావు, డేగల రామచంద్రరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి దేహశుద్ధి

చుంచుపల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయుడిని, ఓ మహిళపై భార్య కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసిన సంఘటనపై చుంచుపల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం కిన్నెరసాని కోడిపుంజుల వాగుకు చెందిన అజ్మీరా హరిదాసు మునియా తండా పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. సదరు మహిళతో కలిసి చుంచుపల్లి మండలంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కలిసి ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న హరిదాసు భార్య తండ్రి, బంధువులు ఆ ఇంటి వద్దకు చేరుకొని వారిని పట్టుకున్నారు. హరిదాసుకు, మహిళకు దేహశుద్ధి చేశారు. ఈ సమాచారం అందుకున్న చుంచుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై సదరు మహిళ ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఎనిమిది మందితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. అదేవిధంగా పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో హరిదాసుపై, సదరు మహిళపై భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఏడాదిలోగా సీతారామ సాగునీరు అందిస్తాం

సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల వెల్లడి

ఖమ్మం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఏడాదిలో సీతారామప్రాజెక్టు పూర్తి చేయించి సా గునీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మమ నాగేశ్వరరావు హామి ఇచ్చారు. ఢిల్లీలో సీతారామప్రాజెక్టు పై టీఏసీ కీలక సమావేశం నేపథ్యంలో మంత్రి తుమ్మల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాదులో కలిసి ప్రాజెక్టు వివరాలు అందించడంతో పాటు డీపీఆర్ రిపోర్టుపై చర్చించారు. సవరించిన అంచనాలు అనుమతించాలని, సీ ఎంకు అందించిన లేఖలో సూచించారు. ఈ మేరకు మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసినప్రకటనలో తెలిపారు.

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టులతో అటు పదిలక్షల ఎకరాల సాగునీరుతో పాటు విద్యుత్ ఉత్పత్తి జరగబోతుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఈప్రాజెక్టుతో సాగునీటి కష్టాలు తీరబోతాయని తెలిపారు. ఢిల్లీలో జరిగే సమావేశానికి అవసరమైన సమాచారంతో పాటు ఈప్రాజెక్టు వల్ల ఉమ్మడి ఖమ్మంతోపాటు మహబూబాబాద్ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందుతుందని, జలవిద్యుత్ ఉత్పత్తి అవుతుందని, టీఏసీ అనుమతి ద్వారా ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులు తొలగబోతాయని తుమ్మల సీఎంకు తెలిపారు.

అలాగే రాష్ట్రం నుంచి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన సీతారామ ప్రాజెక్టు అధికారులు టీఏసీ సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలను కూడా మంత్రి తుమ్మల వారికి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లిఫ్టు ఇరిగేషన్ గతంలో చేపట్టినందున అప్పుడు ఇచ్చిన అనుమతుల వివరాలు కూడా ప్రస్తావించారు. సవరించిన అంచనాలు ప్రభుత్వ ఆర్థికశాఖ పరిశీలనలో ఉందని తక్షణం వాటిని కూడా సవరించాలని ముఖ్యమంత్రిని తుమ్మల కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం కిష్టారంలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పానెం సరస్వతి (49) కూలి పనులకు వెళ్లే తొందరలో ఉతికిన బట్టలను ఇంట్లోని ఐరన్ దండేనికి ఆరేస్తుంది. మరుగుదొడ్డికి వెళ్లే వైరు కూడా ఇదే దండెం తీగకు చుట్టి ఉండటంతో విద్యుత్ ప్రసరించి అక్కడికక్కడే మృతి చెందింది. కాగా ఆమె భర్త రెండునెలల క్రితం మృతి చెందాడు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పంటపొలంలో నడుచుకుంటూ వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ముదిగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రతి సమస్యకు పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులదేనని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. అధికారులు బాధ్యతగా పనిచేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కాలినడకన రైతులు సాగుచేసిన పంటపొలాలను ఆయన పరిశీలించారు. ఏపంటలు ఎక్కువగా సాగుచేస్తున్నారని, పంటల సంరక్షణకు తీసుకుంటున్న సస్యరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కాలేదని రైతులు కొంతమంది కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా వ్యవసాయ శాఖ అధికారులను పిలిచి ఎందుకు కాలేదని ప్రశ్నించారు. సాంకేతిక లోపాలున్న రైతుల వివరాలు బ్యాంకుకు పంపినప్పటికీ ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత బ్యాంకు మేనేజర్లు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్‌కు ఫోన్ చేసి ఆదేశించారు. సన్నరకం ధాన్యానికి బోనస్ చాలా మంది రైతుల ఖాతాల్లో జమ కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడి పెండింగ్ సన్నరకం బోనస్‌పై సిద్ధం చేసి ఆశాఖ అధికారులను ఆదేశించారు. చెట్టు కింద కలెక్టర్ కూర్చొని రైతులతో ముచ్చటించారు. రైతులు పంటపొలాలకు వెళ్లే దారి నిర్మించాలని గ్రామానికి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామస్థులు కోరిన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, ఏవో వేణు, ఆర్ఐలు వహీదా, ప్రసన్నకుమార్, ఏఈవో మౌనిక, కార్యదర్శి పావని పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి నేడు శిక్షణ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు వినియోగించే పీవో, ఏపీవోలకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మొత్తం ఈ ఎన్నికల్లో 108 మంది పోలింగ్ సిబ్బందిని వినియోగించనున్నారు. 27 మంది ప్రిసైడింగ్ అధికారులు, 27 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 53 మంది పోలింగ్ సహాయకులను వినియోగించనున్నారు. వీరిలో పీవో, ఏపీవోలకు బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	38
బీరకాయ	48
పచ్చిమిర్చి	28
కాకరకాయ	48
బెండకాయ	48
పొట్లకాయ	34
దోసకాయ	34-40
చిక్కుడు	44
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	20
దొండ	28-36
సొరకాయ	18
క్యారెట్	28
క్యాప్సికం	48
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహారాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

అక్రమార్కులకే ఉపాధి

కష్టానికి దక్కని కూలి

పని చెయ్యని వారికి హాజరు

రికార్డులు రాయకుండానే చెల్లింపులు

ఒక్కో గ్రామ పంచాయతీలో 20కు పైగా

ఉపాధి నిబంధనలు అతిక్రమణ

సాయంత్రం వరకు సాగిన ఓపెన్ ఫోరమ్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు లేని సమయంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం రఘునాథపాలెం మండలంలో అక్రమార్కులకు ఉపాధి కల్పించినట్లు నిరూపణ జరిగింది. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ ఫోరమ్‌లో 40 గ్రామ పంచాయతీల్లోను ఉపాధి నిభందనల అతిక్రమణ బయటపడింది. ఒక్క పాపటపల్లి గ్రామ పంచాయతీలో మాత్రమే నిబంధనల మేరకు పనులు నిర్వహించి ప్రతి కూలీకి సక్రమంగా డబ్బులు చెల్లించినట్లు వెలుగులోకి వచ్చింది. కష్టపడి పనిచేసిన కూలీలకు హాజరు నమోదు కాక కూలి డబ్బులు చెల్లింపులు జరగలేదు. పనికి రాని వారికి కనీసం హాజరు నమోదు కాని వారికి మాత్రం ఉపాధి డబ్బులు చెల్లించినట్లు సోషల్ ఆడిట్ బృందాలు నిరూపణ చేశాయి. దొనబండ గ్రామ పంచాయతీలో ఉపాధి రికార్డుల నిర్వహణ చేపట్టలేదు. 5రోజులు పనిచేసిన కూలీలకు 4రోజులు చెల్లింపులు చేశారు. రాంక్యాతండా గ్రామ పంచాయతీలో కనీసం ఎస్టిమెట్‌లు లేకుండా ఉపాధి పనులు చేశారు. కూలీల సంతకాలు లేకుండా డబ్బులు డ్రా జరిపినట్లు చూపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం కూడా నర్సరీ కూలీలకు డబ్బులు చెల్లింపులు చేసినట్లు నమోదు చేశారు. బూడిదంపాడు గ్రామ పంచాయతీలో 33 పనులు చేపట్టి 22పనులకు బొర్డులను ఏర్పాటు చేసి మొత్తం బోర్డులకు డబ్బులు డ్రా చేశారు. కూలీ పనులకు రాని వారికి డబ్బులు చెల్లించినట్లు నమోదు చేశారు. హర్యాతండా గ్రామపంచాయతీలో లేబర్ బడ్జెట్ లేకుండా పనులు చేసినట్లు నమోదు చేశారు. సంతకాలు లేకుండా కూలీలకు డబ్బులు చెల్లింపులు చేశారు. ఆశ కార్యకర్తలకు ఉపాధి కూలీ డబ్బులు చెల్లించినట్లు చూపారు. కేవీ బంజర గ్రామ పంచాయతీలో రికార్డులు రాయకుండానే చెల్లింపులు చేశారు. పనిచేసిన కూలీలకు డబ్బులు ఇవ్వలేదు. డబ్బులు పొందిన కూలీల సంతకాలకు పొంతన లేకుండా పోయింది. మంగ్యాతండా గ్రామ పంచాయతీలో కార్యదర్శి సంతకాలు లేకుండానే చెల్లింపులు జరిగాయి. నర్సరీల రికార్డుల నిర్వహణ లేదు. 320 మొక్కలకు కేవలం 140 మొక్కలను మాత్రమే నాటటం జరిగింది. పనిచేసిన కూలీలకు డబ్బులు ఇవ్వలేదు. పాస్ ఆర్డర్ లేకుండానే



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

పేమెంట్ నిర్వహించారు. పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సోషల్ ఆడిట్‌కే హాజరు కాలేదు. మల్లేపల్లి గ్రామ పంచాయతీలో ప్లాంటేసన్ పనులు ఒక్కటి కూడా నిర్వహించలేదు.

ఉపాధి పనులు చేసిన వాటికి కనీసం బోర్డులు పెట్టలేదు. మూలగూడెం గ్రామపంచాయతీలో కూలీల సంతకాలు లేకుండానే హాజరు నమోదు చేశారు. సూర్యతండా గ్రామపంచాయతీలో పనిచేసిన 1,640 మంది కూలీలకు డబ్బులు అందలేదు. పార్టు బీ ఇవ్వకుండానే పార్టు సీ లో నమోదు చేశారు. ఎంపీడీవో అశోక్ కుమార్, అదనపు పీడీ శీనివాసరావు, జిల్లా విజిలెన్స్ అధికారి సక్రియా, ఏపీడీ వెంకట్రాజు, శ్రీదేవి, సోషల్ ఆడిట్ విజిలెన్స్ అధికారులు పవన్, శాస్త్రీ, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, ఏపీవో పద్మయ్యానాయుడు పాల్గొన్నారు.

వాడిన వంట నూనెలతో బయో డీజిల్ ఉత్పత్తి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వాడిన వంట నూనెలతో బయో డీజిల్‌ను ఉత్పత్తి చేయటం ద్వారా నూనె వ్యర్థాలను తొలగించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు రెస్టారెంట్ నిర్వాహకులు సహకరించాలని ఉమ్మడి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలో ఈకొనోవా ఎనర్జీ అవగాహన సదస్సులో రెస్టారెంట్ నిర్వాహకులకు వంటనూనెల వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఇండియా ద్వారా రూపొందించిన రూకో ద్వారా బయో డీజిల్ సేకరించటం జరుగుతందని వివరించారు. నాణ్యమైన వంట నూనెలను వినియోగించక పోవటంతో క్యాన్సర్, మతిమరుపు వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. ఒక సారి వాడిన వంట నూనేను మరోసారి వాడకుండా బయో డీజిల్ ఉత్పత్తికి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సేఫ్టీ అధికారి శరత్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామారావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ వినియోగంపై అవగాహన ఉండాలి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ నెట్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గివుండాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ అన్నారు. మంగళవారం సురక్షిత ఇంటర్‌నెట్ దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, సిబ్బందికి ఇంటర్‌నెట్ వినియోగంపై వర్క్ షాప్ నిర్వహించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ, ఐసీయా ప్రాజెక్ట్ ద్వారా, యన్ఐసీ, సీడాక్ కేంద్ర సంస్థల సహకారంతో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాల్లో సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై వర్క్ షాప్ నిర్వహించారని, ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో యన్ఐసీ జిల్లా కేంద్రం అద్వర్యంలో ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు. వర్క్ షాప్‌లో భాగంగా యన్ఐసీ అధికారులు డీఐవో రాంప్రసాద్, డీఐఎ. భిక్షు ఇంటర్ నెట్ వినియోగం, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తలు తదితర అంశాలపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఇంటర్‌నెట్ వినియోగంపై రూపొందించిన బ్రోచర్ ను జిల్లా రెవెన్యూ అధికారిణి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు భూమి ఆక్రమణలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చెరువు భూములు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం అక్రమార్కులకు పరిపాటిగా మారింది. ఈ ఆక్రమణలు ఖమ్మం రూరల్ మండలంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. చెరువు భూములు ఆక్రమణలు జరుగుతున్నా సంబంధిత ఐబి శాఖాధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపనలు బలంగా వినిపిస్తున్నాయి. ఖమ్మం రూరల్ మండలం, పల్లెగూడెం గ్రామం పరిదిలోని చెరువు భూమిని ఖమ్మం-కొరవి ప్రధాన రహదారి పక్కన కొందరు అక్రమార్కులు ఆక్రమించుకుని అందులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రదాన రహదారి పక్కనే ఎదేచ్ఛగా చెరువు భూమిని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా సంబందిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఐబి శాఖ అధికారులు స్పందించి చెరువు భూమి ఆక్రమనలను అడ్డుకుని ఆక్రమనిర్మాణాలను అరికట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరెంపుల గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా అందిస్తున్న తాగు నీరు సరిపోవడం లేదు. దీనికి తోడు గ్రామ పంచాయతీకి ఉన్న బోరు మోటరు, పైపులైను మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తీరడంలేదు. దీంతో ఆరెంపుల మాజీ సర్పంచి బండి జగదీష్ రూ.90 వేలతో బోరుకి కొత్త మోటారు తీసుకువచ్చి, పైపులైన్లు మరమ్మతులు చేయించి మంగళవారం గ్రామస్తులకు పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాను పునరుద్దరించారు. ఆరెంపుల గ్రామంతో పాటుగా బారుగూడెం గ్రామానికి కూడా ఈ బోరు నుండే తాగు నీరు సరఫరా అవుతుంది. దీంతో ఆరెంపుల గ్రామంతోపాటు బారుగూడెం ప్రజలకు కూడా కష్టాలు తొలగిపోయాయని గ్రామస్తులు తెలిపారు.

కిష్టారంవాసుల దీక్షకు మద్దతు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కారణంగా నష్టపోతున్నామంటూ మండలంలోని కిష్టారంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పూర్తి మద్దతు తెలిపారు. మంగళవారంతో 2వ రోజుకు చేరిన దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీ నిర్మాణంలో అప్పటి నాయకులు మీ చేతులు కట్టేశారా అని సింగరేణి అధికారులను ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ఒక్క నిమిషం ఆలోచించి బంకర్‌ను రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించినట్లయితే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడినట్లు తెలిపారు. న్యాయం జరిగే వరకు తమ పూర్తి మద్దతు మీకేనని, కిష్టారం గ్రామస్థుల సమస్యలను సింగరేణి సంస్థ పరిష్కరించిన తర్వాతనే దీక్షలను విరమిస్తారని తేల్చి చెప్పారు. ఇదేవిషయమై సత్తుపల్లి ఎమ్మెల్యే డా.రాగమయి కిష్టారం సమస్యను అసెంబ్లీలో లేవనెత్తారన్నారు.

సింగరేణి అంకితభావంతో పనిచేస్తుంది

కాలుష్య నివారణకు సంస్థ అన్ని చర్యలను తీసుకుంటుందని, ఈ క్రమంలోనే ప్రజా సమస్యలపై సింగరేణి అంకితభావంతో పనిచేస్తుందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అన్నారు. మంగళవారం సంప బా ధ్యులు జేవీఆర్ ఓసీలోని సీహెచ్‌పీని సందర్శించి కిష్టారం గ్రామస్థులు నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో దారా భీమయ్య, భరణి, కిషోర్, నరసింహారావు, ప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, సుషీల్ తదితరులు పాల్గొన్నారు.

91 లక్షలకు ఐపీ

ఖమ్మం లీగల్ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన చింతల రవికుమార్ రూ.91,04,593 రూపాయలకు దివాళా పిటీషన్ దాఖలుచేశాడు. ఫిర్యాదిదారుడు రియల్ ఎస్టేట్ వ్యాపారంచేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేటు వ్యక్తులు, అధిక మొత్తంలో అప్పులు చేశాడు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావటంతో రుణదాతల నుంచి ఒత్తిడి తీవ్రం అయింది. దీంతో 10 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్ జడ్జికోర్టులో దివాళా పిటీషన్ దాఖలుచేశారు.

సీఎం ఫోటోతో ఓపెన్ ఫోరం

యథేచ్ఛగా అధికారుల కోడ్ ఉల్లంఘన

రఘునాథపాలెం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అ మలులోకి రావటంతో ప్రభుత్వ కార్యాలయాల్లోని సీఎం ఫొటో నుంచి పూర్వ ప్రధాన మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల చిత్ర పటాలను తొలగించారు. ప్రధాన వీధుల వెంట ఉన్న నాయకుల విగ్రహాలపై ముసుగులు వేశారు. ఖచ్చితంగా ఎన్నికల నియమావళిని అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే జాతీయ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న ఓపెన్ ఫోరమ్‌లను సైతం ఇన్నర్ ఫోరమ్‌లుగా కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అయితే రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ ఫోరమ్‌లో మాత్రం ఎన్నికల నియమావళి అమలు చేయలేదు. ఫోరమ్‌లో పాల్గొనేందుకు 40 గ్రామపంచాయతీల నుంచి హాజరు కాగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని గోడకు ఉంచి మరీ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించారు. యధేచ్ఛ ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు ఇటువంటి చర్యలకు పాల్పడటం సరికాదని నిరసన వ్యక్తం చేశారు.



సత్యసాయి మందిర 26వ వార్షికోత్సవం నేడు

నేలకొండపల్లి,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలో సువిశాల ప్రాంగణంలో 26 సంవత్సరాల క్రితంసత్యసాయి ఆశీస్సులతో నిర్మించిన సాయి సుందర రామదాస మందిర 26వ వార్షికోత్సవం బుదవారం నిర్వహించనున్నారు. మందిరంలో ఉదయం 5గంటలకు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. 5గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 7గంటలకు శీషిరిడీ సాయినాధునికి పంచామృతాభిషేకం, 9గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 11గంటలకు శ్రీనాయినామ సంకీర్తన(భజన) నిర్వహిస్తారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యారుథలకు బహుమతులను అందచేస్తారు. 1గంటకు విద్యార్థులకు పుట్టపర్తి గురించి చిత్ర ప్రదర్శన చేస్తారు. మధ్యాహ్నం 1.20లకు మహా మంగళ హారతి, నారాయణ సేవల అనంతరం అన్నదానం చేస్తారు. కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా సత్యసాయి సేవాదళ్ ఏపీ సమన్వయ కర్త కొమరగిరి శ్యాంప్రసాద్ హాజరవుతారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 26వ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సత్యసాయి సేవా సమితి మంగళవారం ఒక ప్రకటనలో కోరింది.

వైరా వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు

వైరా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు చేస్తామని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు తెలిపారు. ఖమ్మం మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తిన నేపథ్యంలో జిల్లాలోని వైరా మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన లక్ష్మణుడు వైరా చేరుకొని ఈ పరిధిలోని కోల్డ్‌స్టోరేజీల యజమానులు, మిర్చి కొనుగోలుదార్లతో మంగళవారం వైరా మార్కెట్ యార్డులో సమావేశం ఏర్పాటుచేసి అభిప్రాయాలు స్వీకరించారు. వైరాలో మిర్చి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పక్షాన కాంగ్రెస్ ప్రతినిధులు లక్ష్మణుడికి ఒక వినతిపత్రం సమర్పించారు. కోల్డ్‌స్టోరేజీ యజమానులు, వ్యాపారులను అభిప్రాయాలను సావధానంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వైరాలో మిర్చి కొనుగోళ్లు చేస్తామన్నారు.

ముమ్మరంగా శానిటేషన్ గ్యాంగ్ డ్రైవ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో 120 మందితో ఏర్పాటు చేసిన పారిశుద్య గ్యాంగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంగళవారం 8, 14, 26, 34, 47, 49 డివిజన్లలో పారిశుద్య పనులు చేపట్టారు. డ్రైనేజీలను శుభ్రం చేశారు. రహదారుల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించారు. పిచ్చి మొక్కలను తొలగించి రహదారులను, వీదులను, డ్రైనేజీలలోని చెత్తను బయటపడేశారు. శానిటేషన్ పర్యవేక్షకులు సాంబయ్య, ఇన్స్‌పెక్టర్లు మల్లయ్య, వెంకటేశ్వర్లు, షేక్ బాబా, భీమయ్య, శంకర్ పర్యవేక్షణ చేశారు.

త్రిషను ఆదర్శంగా తీసుకొని క్రికెట్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్ ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అండర్-19 మహిళల వరల్డ్ కప్ పోటీలలో ప్రతిభ చూపి భారత జట్టు విజయానికి దోహదపడ్డ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన క్రీడాకారిణి గొంగడి త్రిషను ఆదర్శంగా తీసుకొని బాలికలు క్రికెట్‌లో రాణించాలని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట మూడు జిల్లాల అండర్- 14 బాలికల ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలను ప్రారంభించడానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు చదువుతో పాటు క్రీడలను తప్పని సరిగా ఆడాలని అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ గౌస్, మతిన్, ఉపేందర్, పద్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలకు చెక్

పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు

కామేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమాలకు అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక చొరవ చూపుతోంది. అందులో భాగంగా కొత్తలింగాల క్రాస్‌రోడ్‌లో పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. సరైన ప్రత్రాలు లేకుండా ఇసుకను రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని, వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. గత రెండు రోజుల క్రితం సరైన పత్రాలు లేని మూడు లారీలను సీజ్ చేయడం జరిందని ఎస్ఐ బి.సాయి కుమార్ తెలిపారు. మంగళవారం చెక్‌పోస్టును లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు పరిశీలించారు. ఈ పరిశీలనలో సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ సాయికుమార్ పోలీసులు పాల్గొన్నారు.

మిర్చికి రూ.25 వేలు చెల్లించాలి: సీపీఎం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): మిర్చికి కనీస మద్దతు ధర రూ.25వేలు చెల్లించి మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని సుందరయ్యభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెగుళ్లు, గణనీయంగా పెరిగిన పెట్టుబడులు నేపథ్యంలో క్వింటాకు రూ.25వేలు చెల్లిస్తేనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోళ్ల జరపాలని కోరారు. ఖమ్మం మార్కెట్‌కు సోమవారం ఒక్కరోజే లక్షబస్తాలు పైగా మిర్చి అమ్మకానికి వచ్చిందన్నారు. జెండా పాట రూ.14వేలుపలికినా అధికంగా మిర్చిని క్వింటాకు రూ13వేలలోపే కొనుగోలు చేశారన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా పూడే పరిస్థితి లేదని తెలిపారు. జిల్లాలో ఇటీవల ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దీనిపై జిల్లా కు చెందిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, ప్రైవేటు వ్యాపారుల సైతం మంచి ధరకు కొనుగోలుచేస్తారన్నారు. ప్రస్తుతం మిర్చి బోర్డు కేరళ రాష్ట్రంలో ఉందని, మద్దతు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ధరకోసం మిర్చిబోర్డును ఏపీ తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఖమ్మంలో ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం నుంచి మిర్చి రైతులతో సమావేశాలు నిర్వహించి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలన్నారు. వరితోపాటు మిగిలిన పంటలన్నింటికి బోనస్ చెల్లించాలని కోరారు. మిర్చి ధరలపై తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యర్రా శ్రీకాంత్, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

కామేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడి నెల పదిరోజులు మృత్యువుతో పోరాడి మృతిచెందాడు. విచారణ సంఘటన కారేపల్లి మండలం ఎర్రబోడులో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సింగరేణి మండలం ఏర్రబోడుకు చెందిన పండగ రామయ్య(43) పనుల నిమిత్తం తన బైక్‌పై గత నెల 2వ తారీఖు ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుండగా ఊట్కూర్ శివారులో చీమలపాడుకు చెందిన అజ్మీరా రాజ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంతో ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తలకు శస్త్ర చికిత్స చేశారు. అనంతరం అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. నెల పదిరోజల చికిత్స అనంతరం మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. జనవరి 3న పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్న డబ్బులు మొత్తం ఆసుపత్రులకే పెట్టామని, అయిన తన భర్త బ్రతకలేదని ఆయన భార్య ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పుడు నేను, నా పిల్లలు ఎలా బ్రతకాలని ఏడుస్తుండడంతో గ్రామస్తులు ఓదార్చారు. నా భర్తను ప్రమాదానికి గురి చేసి వ్యక్తిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆమె వేడుకుంటోంది.

పరిహారం కోసం భూనిర్వాసితుల దీక్ష

సత్తుపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి భూముల్లో సింగరేణి భూ నిర్వాసితులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ కోసం భూ సేకరణ సందర్భంగా తమ భూములు తీసుకుని ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకూ పరిహారం ఇవ్వలేదని ఆరోపిస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీనికి సంబంధించి ఆందోళన చేస్తున్న వాసిరెడ్డి వసుప్రదారాణి, మోరంపూడి ప్రసాద్, ఎర్రా లీలావతీలు విలేకరులతో మాట్లాడుతూ కొమ్మేపల్లి రెవెన్యూ పరిధిలో 70ఎకరాల భూమి ఓపెన్ కాస్ట్ బొగ్గు గనికోసం సేకరించేందుకు 2016లో ఇచ్చిన అవార్డు 2018లో అధికారులు రద్దుచేసి 2022లో ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. అభ్యంతరాల కోసం అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ సందర్భంగా కొందరు రైతులు సదరు భూములు తమవేనంటూ అభ్యంతరాలు చెప్పారని అన్నారు. దీనిపై అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వేచేసి నిజమైన హక్కుదారులను గుర్తించారని చెప్పారు. మొత్తం 70ఎకరాలకు అధికారులు భూ సేకరణ చేపట్టగా, వీరిలో కొందరికి పరిహారం అందించారన్నారు.

అనారోగ్యంతో లస్కర్ మృతి

నేలకొండపల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగాపురంతండాకు చెందిన బానోతు భద్రు(58) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. మృతుడు ఎన్నెస్పీలో లస్కర్‌గా పని చేస్తున్నాడు. గతంలో వీఆర్యేగా పని చేసాడు. వీఆర్యే వ్యవస్థ రద్దు గావటంతో లస్కర్‌గా నియమించారు. భద్రు మృతికి పూర్వ వీఆర్యేలు, లస్కర్‌లు సంతాసం తెలిపారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్సు ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని 108 జిల్లా కో ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో ఉన్న 108 అంబులెన్సు పాతది కావడంతో కొత్తవాహనం ఏర్పాటుచేశారు. కాగా 108 సర్వీసులో ఉన్న పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ఆయన తెలుసుకున్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో 108కు ఫోన్‌చేసి వైద్యసేవలు పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఈఎన్‌టీలు కృష్ణయ్య, నాగయ్య, పైలెట్లు వీరయ్య, సక్రు పాల్గొన్నారు.

టాలెంట్‌టెస్టులో విద్యార్థుల ప్రతిభ



తిరుమలాయపాలెం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్సెస్ టీచర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫిజికల్ సైన్సు టాలెంట్ టెస్టులో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాయికిరణ్ తృతీయస్థానం, తెట్టెలపాడు పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బి.గణేష్ తెలుగుమీడియంలో ద్వితీయస్థానం సాధించారు. ఈ నెలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టాలెంట్‌టెస్టుకు వీరు ఎంపికయ్యారు. కాగా విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన మదన్‌లాల్



కేటీఆర్‌ను సన్మానిస్తున్న మదన్‌లాల్

వైరా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులతో కేటీఆర్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇక్కడి నాయకులతో కలిసి మదన్‌లాల్ పాల్గొన్నారు.

కొత్తతండాలో బోనాల పండుగ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతామధు

కారేపల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తతండాలో మంగళవారం ఆంజనేయస్వామికి మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయం ప్రతిష్ఠించి ఏడాది అయిన సందర్భంగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతామధు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముత్యాల వెంకటప్పారావు, తోటకూరి పిచ్చయ్య, ముత్యాల సత్యనారాయణ,మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కారేపల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మాణమవుతున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా నవగ్రహాల విగ్రహాల కోసం అనంతోజు తిరుమల చార్యులు, పోలంపల్లి గ్రామ పురోహితులు మద్దోజు అశోక్‌చార్యులు కలిసి రూ.25వేల విశ్వకర్మ కమిటీ సభ్యులకు అందజేశారు. మార్చి 2న ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తుమ్మోజు రాంమూర్తి, అనంతోజు లక్ష్మణాచారి, పోలోజు రామాచారి, అద్దంకి వీరభద్రచారి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వేంసూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపాడు గ్రామంలో రామాలయం వార్షికోత్సవం సందర్భంగా నోస్ ల్యాబ్ అధినేత డాక్టర్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సత్యనారాయణరెడ్డి, డాక్టర్లు సత్యసాయికుమార్, ఉమామహేశ్వర్, మల్లికార్జున్, నవీన్‌కుమార్, రాజశేఖర్, సాయిబాబా, రవీందర్, వివేక్‌లు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో మైసాక్షి దుర్గారావు, గడ్డం ప్రతాపరెడ్డి, గడ్డం అంజిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ శరత్‌బాబు తెలిపారు. సత్తుపల్లి టౌన్-1 ఫీడర్‌లో నిర్వహణ నిమిత్తం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందని, వేంసూర్ రోడ్, ఎన్టీఆర్ నగర్, కృషి బై పాస్ రోడ్, మదర్‌థెరిస్సా కళాశాల ఏరియాలలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెల్టు షాపుల నిర్వాహకుల బైండోవర్

బోనకల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామాలకు సంబంధించి బెల్టు షాపులను నిర్వహిస్తున్న దాదాపు 80 మందిని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. పూచికత్తుతో తహసీల్దార్ పున్నమ్ చందర్ వారిని వదిలి పెట్టారు.

మధిర టౌన్ ఎస్‌హెచ్‌వోగా రుత్విక్‌సాయి



మధిరటౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మధిర టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ట్రైనీ ఐపీఎస్ కొట్టే రుత్విక్ సాయి మంగళవా రం బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎస్‌కు ఎంపికైన ఆయన ఎస్‌ఐ బాధ్యతలు, విధులను తెలుసుకునేందుకు శిక్షణలో భాగంగా ఈ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సీఐ మధు, ఎస్‌ఐలు సంధ్య, లక్ష్మి భార్గవి అభినందనలు తెలిపారు.

పథకాలను అమలు చేసుకుంటూ వస్తున్నాం

» ఎమ్మెల్యే మట్టా రాగమయి



చీరెలను అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం పథకాలను అమలు చేసుకుంటూ వస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం సత్తుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2014, 2018లో బీఆర్ఎస్ ఎన్నికల సమయం లో ఇచ్చిన మేనిఫెస్టోలో ఏదీ అమలు చేయలేదని ఆరోపించారు. వాటిని వదిలేసిన బీఆర్ఎస్ లఘుచర్లలో ధర్నా చేస్తూ ఇప్పుడు రైతులంటే కపట ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నాసిరకంగా నిర్మించారని, దళిత బంధు, గృహలక్ష్మీ పథకం కింద ఉన్న ఇళ్లు ఊడబీక్కుని రోడ్డుపాలవ్వగా ఎన్నికల కోడ్ వస్తుందని గత ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. వీధికి రెండుమూడు శిలాఫలకాలను హడావుడిగా ఆవిష్కరించిన బీఆర్ఎస్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేసిందన్నారు. రైతు రుణమాఫీని సైతం పూర్తిగా అమలు చేయ్యలేని బీఆర్ఎస్ పార్టీ అబద్దపు ప్రచారాలను ప్రజలను నమ్మరన్నారు. రూ.7లక్షల కోట్ల అప్పును తెలంగాణ ప్రజల నెత్తిన రుద్దారని, ఇప్పటివరకు రూ.65వేల కోట్ల వడ్డీని కాంగ్రెస్ ప్రభుత్వం కడుతుందన్నారు. జిల్లాలో ఊసేలేని టీఆర్ఎస్ పార్టీని ఉన్నత స్థాయికి తీసుకొచ్చిన ఇప్పటి మంత్రి పొంగులేటిని, మమ్మల్ని మోసం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో మేము వెనుకబడింది లేదన్నారు.

పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లోని క్రీస్తుసంఘం ప్రార్థనా మందిరం 33వ వార్షికోత్సవం సందర్భంగా కనకపూడి నాగార్జున, రజిని దంపతుల ఆర్థిక సహాయంతో నిరుపేదలకు చీరెలను ఎమ్మెల్యే రాగమయి చేతులమీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీస్తుసంఘం ఇండియా డైరెక్టర్ రాబర్ట్ మేడిసన్, కొత్తపల్లి ప్రభాకర్, అనిల్‌కుమార్, నవకుమార్, నాగేశ్వరరావు, కుమార్‌రాజా, పుల్లారావు, నాగార్జున, ప్రభుదాస్, పాపారావు, బంకా నరేష్, నారాయణ, బంకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైరా ఏఎంసీలో మిర్చి కొనుగోళ్లు చేస్తాం

» రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు



లక్ష్మణుడికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా/ఏన్కూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు చేస్తామని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు తెలిపారు. ఖమ్మం మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తిన నేపథ్యంలో జిల్లాలోని వైరా మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన లక్ష్మణుడు వైరా చేరుకొని ఈ పరిధిలోని కోల్డ్‌స్టోరేజీల యజమానులు, మిర్చి కొనుగోలుదార్లతో మంగళవారం వైరా మార్కెట్ యార్డులో సమావేశం ఏర్పాటుచేసి అభిప్రాయాలు స్వీకరించారు. వైరాలో మిర్చి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పక్షాన కాంగ్రెస్ ప్రతినిధులు లక్ష్మణుడికి ఒక వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వైరాలో మిర్చి కొనుగోళ్లు చేస్తామన్నారు. ఇదే శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఖమ్మానికి చెందిన ఉమామహేశ్వరరావు సలహాలు, సేవలను కూడా వినియోగించుకుంటామని తెలిపారు. అలాగే వేర్ హౌజింగ్ డెవలప్ మెంట్ అండ్ రెగ్యులేటరీ అథార్టీ(డబ్ల్యూడీఆర్ఏ) ఏర్పాటుకు తానే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మార్కెట్‌శాఖ అధికారులు అలీం, నరేందర్, వైరా, ఇల్లెందు ఏఎంసీల సెక్రటరీలు మోసినా సుల్తానా, నరేష్, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు పమ్మి అశోక్, పణితి శ్రీను, బొర్ల గంగారావు, పల్లపు కొండలు, పాలేటి నర్సింహారావు, పొట్టపల్లి శ్రీను, వీరంశెట్టి సీతరాములు, దేనువకొండ పుల్లంరాజు, తుమ్మలపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, మార్కెట్ కార్యదర్శి బజార్, సూపర్‌వైజర్లు రామారావు, అనూష, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ

కల్లూరు, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణకు, ఆత్మస్థైర్యంకు వారంలో ఒక రోజు పాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందస్తుగా కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని బత్తుపల్లి, చిన్నకోరుకొండి, చెన్నూరు, పేరువంచ, కల్లూరు ఉన్నత పాఠశాలల్లో బాలికల ఆత్మస్థైర్యం కోసం ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, పద్మ, మధు, రమణయ్యలు తెలిపారు.

మిర్చి క్వింటాకు రూ.25వేల మద్దతు ధర చెల్లించాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చి క్వింటా ఒక్కింటికి రూ.25వేలు మద్దతు ధర చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం వైరాలో మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గత రెండు సీజన్లలో మిర్చి ధర పూర్తిస్థాయిలో పతనం కావడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. అందువలన క్వింటా ఒక్కింటికి రూ.25వేల ధర చెల్లించాలని కోరారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, నాయకులు బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, మాదినేని రజిని, కురుగుంట్ల శ్రీనివాసరావు, రుద్రాక్షల నర్సింహాచారి, బండారుపల్లి వెంకటేశ్వరరావు, అమరనేని కృష్ణ, యలమంచిలి భోగేశ్వరరావు, వడ్లమూడి మధు, పాసంగులపాటి చలపతిరావు, శీలం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలి

» మునిసిపల్ కమిషనర్ నర్సింహ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సత్తుపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు కమిషనర్ కొండ్రా నర్సింహ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని 5,7వార్డులలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డులలో శానిటేషన్, డ్రైయినేజీలకు సంబంధించిన సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీరు ఎక్కడా నిలువ ఉండకుండా చూసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీ.రాధాకృష్ణకు సూచించారు.



లక్కినేని రఘును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

పలు కుటుంబాలను పరామర్శించిన సండ్ర

కల్లూరు, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో పలు కుటుంబాలను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం పరామర్శించారు. బీఆర్ ఎస్ నాయకుడు లక్కినేని రఘుతో పాటు పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు కట్టా అజయ్‌కుమార్, కాటంనేని వెంకటేశ్వరరావు, యస్‌కె కమ్లి, మేకల కృష్ణ, పెడకంటి రామకృష్ణ, పెద్దబోయిన నారాయణరావు, కొరకొప్పు ప్రసాద్, సీహెచ్ కిరణ్, చారుగుండ్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులతో ఇసుక రవాణా చేపట్టాలి

ముదిగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక తరలించేందుకు అనుమతి ఉంటేనే రవాణా చేపట్టాలని తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, సీఐ మురళీ పేర్కొన్నారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. పెద్దమండవ, గంధసిరి మున్నేరు నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నట్లు వారు తెలిపారు. డీటీ ఉసికల ఉపేందర్, సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల చట్టాలపై అవగాహన

కొణిజర్ల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు, చట్టాలపై హ్యూమన్‌రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం, హ్యూమన్‌రైట్స్ సొసైటీ రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆదూరి మణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని పల్లిపాడు కార్తీక్ విద్యాలయంలో బహుజన అభ్యుదయ సేవాసమితి మండల అధ్యక్షుడు కొమ్ము భద్రయ్య అధ్యక్షతన జరిగిన బాలల హక్కుల అవగాహన సదస్సులో వారు పాల్గొని చట్టాలు గురించి వివరించారు. అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలంటే క్రమశిక్షణ, పట్టుదల కలిగి ఉండాలని తెలిపారు. తమ పనులు చేసుకుంటూనే కొంత సమయాన్ని మానవహక్కులను ప్రచారం చేయడానికి స్వచ్ఛందంగా పని చేస్తున్నామన్నారు. ఆశా కార్యకర్తలకు, డ్వాక్రా మహిళలకు, విద్యార్థులకు, అంగన్‌వాడీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలును అరికట్టాలని, మైనర్‌లు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మైనర్‌లు డ్రైవింగ్ చేయరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల డేటా ఎంట్రీ పరిశీలన

కారేపల్లి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రేషన్‌కార్డుల డేటా ఎంట్రీని మంగళవారం తహసీల్దార్ ఎస్. సంపత్‌కుమార్ పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వ అదేశాల మేరకు నూతన రేషన్‌కార్డుల కోసం పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. వాటికి సంబంధించి కార్యాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీచేస్తున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ సంపత్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ కార్యాక్రమాన్ని త్వరతగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు.

సీతమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

బోనకల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సీతమ్మ కుటుంబ సభ్యులను మంగళవారం సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, కిలారు సురేష్, దొండపాటి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రం, జొన్నలగడ్డ సునీత తదితరులు పరామర్శించారు. సీతమ్మ ఆదర్శ బావజాలం నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

వాలీబాల్ క్లబ్ మండల అధ్యక్షుడిగా కృష్ణ

తల్లాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండల వాలీబాల్ క్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ క్రీడాకారుడు దారావత్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో వాలీబాల్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గరిడేపల్లి వెంకటేశ్వరరావు(జీవీఆర్) ఆధ్వర్యంలో వాలీబాల్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉపేందర్, గౌరవ అధ్యక్షులుగా జీవీఆర్, నరాల గోపాల్‌రెడ్డి ఎంపికయ్యారు. మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు షేక్.యూసూబ్, ఈలప్రోలు చిన్నకోటయ్య, క్రీడాకారులు రవి, బాలాజీ, గుడిపల్లి రాంబాబు, రోబో, సంపత్, వినోద్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ఎన్నిక

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి బస్టాండ్ వీఎం.బంజర అడ్డా ఆటో యూనియన్ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా అంబోజు శ్రీనివాసరావు, నందిపాటి రవి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా షేక్ గుంశావలి, జాయింట్ సెక్రటరీగా ఇనపనూరి అబ్రహం, గౌరవాధ్యక్షుడిగా షేక్.బాజీలు గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు.

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సతీష్

పెనుబల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫొటో అండ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెనుబల్లి మండల అధ్యక్షుడు మల్లెల సతీష్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన జిల్లాకార్యవర్గ సమావేశంలో సతీష్‌ను ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఆయన నియామకం పట్ల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల నర్సింహారావు, సీనియర్ ఫొటోగ్రాఫర్లు కనకాచారి, గోదా శ్రీనివాసరావు, వేముల రవికుమార్, పెద్దబోయిన వరప్రసాద్, మిద్దే భాస్కర్, నాగేశ్వరరావు, మధు అభినందనలు తెలిపారు.

మదర్‌థెరిస్సా కళాశాలకు అవార్డు

సత్తుపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కొత్తూరులోని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల బెస్ట్ ఫెర్మామెన్స్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఈ అవార్డును సిస్కో నెట్‌వర్కింగ్ అకాడమీ, టాస్క్ సంయుక్తంగా 2025సంవత్సరానికి గాను ఇచ్చాయన్నారు. తమ కళాశాలలో ఎక్కువ మందితో సిస్కో సర్టిఫికేట్ కోర్స్ పూర్తి చేయించడంతో ఈ అవార్డు లభించిందన్నారు. అదేవిధంగా తమ కళాశాలలో సీఎస్సీ విభాగంలో అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న మేడా వెంకటేశ్వరరావుకు బెస్ట్ ఇన్‌స్ట్రక్టర్‌గా అవార్డు పొందారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

నీలాద్రీశ్వరుడికి పూజలు చేసిన పీఠాధిపతులు

పెనుబల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నీలాద్రీశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని మంగళవారం తుని పీఠాధిపతులు అనంత సచ్చిదానంత సరస్వతి స్వామి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పాకాల వెంకటరమణ, చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు స్వాగతం పలికారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న కల్యాణ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కోదండ రామాలయ వార్షికోత్సవ వేడుకలు

బోనకల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపల్లి గ్రామంలో కొలువు దీరిన శ్రీ కోదండ రామాలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పాండురంగయ్య శాస్త్రీ ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు రామాలయ వార్షికోత్సవం

వేంసూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపాడు గ్రామంలో వేంచేసియున్న రామాలయ రెండో వార్షికోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. నోస్ ల్యాబ్ అధినేత డాక్టర్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సవ వేడుకలు జరుగనున్నాయి.

పరిహారం కోసం భూనిర్వాసితుల దీక్ష



కొమ్మేపల్లి భూముల్లో దీక్ష చేస్తున్న భూ నిర్వాసితులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి భూముల్లో సింగరేణి భూ నిర్వాసితులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ కోసం భూసేకరణ సందర్భంగా తమ భూములు తీసుకుని ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకూ పరిహారం ఇవ్వలేదని ఆరోపిస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీనికి సంబంధించి ఆందోళన చేస్తున్న వాసిరెడ్డి వసుప్రదారాణి, మోరంపూడి ప్రసాద్, ఎర్రా లీలావతీలు విలేకరులతో మాట్లాడుతూ కొమ్మేపల్లి రెవెన్యూ పరిధిలో 70ఎకరాల భూమి ఓపెన్ కాస్ట్ బొగ్గు గనికోసం సేకరించేందుకు 2016లో ఇచ్చిన అవార్డు 2018లో అధికారులు రద్దుచేసి 2022లో మరలా ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. అభ్యంతరాల కోసం అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ సందర్భంగా కొందరు రైతులు సదరు భూములు తమవేనంటూ అభ్యంతరాలు చెప్పారని అన్నారు. దీనిపై అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వేచేసి నిజమైన హక్కుదారులను గుర్తించారని చెప్పారు. మొత్తం 70ఎకరాలకు అధికారులు భూ సేకరణ ప్రక్రియ చేపట్టగా, వీరిలో కొందరికి పరిహారం అందించారని తెలిపారు. ఆందోళన చేస్తున్న నిర్వాసితులను మంగళవారం సీపీఎం నాయకులు మోరంపూడి పాండురంగారావు, రావుల రాజబాబులు పరామర్శించి మద్దతు ప్రకటించారు.

సాగర్ జలాలను నిరంతరాయంగా విడుదల చేయాలి

» సీపీఎం డివిజన్ కార్యదర్శి గోపాలరావు

బోనకల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాలను నిరంతరాయంగా విడుదల చేసి చివర భూముల్లో సాగు చేసిన మక్క పంటను కాపాడాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారబందీ విధానం వలన చివర భూముల్లో సాగు చేసిన పంటలకు సక్రమంగా నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బోనకల్ మండలంలో 15,500 ఎకరాల్లో మక్క పంటను సాగు చేశారని తెలిపారు. ఆళ్లపాడు, తూటికుంట్ల, నారాయణపురం, పోలంపల్లి, దబ్బాకుపల్లి మైనర్ల కింద నీళ్ల సక్రమంగా అందక పైరు వడబడి పోతుందన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే బీబీసీకి నీటి విడుదలను నిలిపి వేయడం వలన రైతులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, జిల్లా నాయకుడు దొండపాటి నాగేశ్వరరావు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

కిష్టారంవాసుల నిరాహార దీక్షకు మద్దతు

» కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్టా దయానంద్



దీక్షలో పాల్గొన్న దయానంద్

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కారణంగా నష్టపోతున్నామంటూ మండలంలోని కిష్టారంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పూర్తి మద్దతు తెలిపారు. మంగళవారంతో 2వ రోజుకు చేరిన దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీ నిర్మాణంలో అప్పటి నాయకులు మీ చేతులు కట్టేశారా అని సింగరేణి అధికారులను ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ఒక్క నిమిషం ఆలోచించి బంకర్‌ను రెండు కిలో మీటర్ల దూరంలో నిర్మించినట్లయితే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడినట్లు తెలిపారు. కిష్టారం గ్రామస్థుల సమస్యలను సింగరేణి సంస్థ పరిష్కరించిన తర్వాతనే దీక్షలను విరమిస్తారని తేల్చి చెప్పారు. ఇదేవిషయమై సత్తుపల్లి ఎమ్మెల్యే డా.రాగమయి కిష్టారం సమస్యను అసెంబ్లీలో లేవనెత్తారన్నారు.

సింగరేణి అంకితభావంతో పనిచేస్తుంది : ఏఐటీయూసీ

కాలుష్య నివారణకు సంస్థ అన్ని చర్యలను తీసుకుంటుందని, ఈ క్రమంలోనే ప్రజా సమస్యలపై సింగరేణి అంకితభావంతో పనిచేస్తుందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అన్నారు. మంగళవారం సంఘ బాధ్యులు జేవీఆర్ ఓసీలోని సీహెచ్‌పీని సందర్శించి కిష్టారం గ్రామస్థులు నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో దారా భీమయ్య, భరణి, కిషోర్, నరసింహారావు, ప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.